


# శతఘ్ని న్యూస్
జనగళమే మా గళం

సోమవారం, 03 జూన్ 2024




# నిర్ణయాత్మకమైన కౌంటింగ్ ఘట్టంలో ఏజెంట్ల పాత్ర కీలకం



* శ్రీ పవన్ కళ్యాణ్ మెజారిటీకి సంబంధించి జాతీయ స్థాయిలో ఉత్కంఠ ఉంది
* భీమవరంలో కౌంటింగ్ ప్రక్రియలో జరిగిన పొరపాట్ల కారణంగా నష్టపోయాం
* అటువంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
* ఎగ్జిట్ పోల్స్ కూడా కూటమికి ప్రోత్సాహకరంగా ఉన్నాయి
* పిఠాపురం నియోజకవర్గం కౌంటింగ్ ఏజెంట్ల సమావేశంలో శ్రీ నాగబాబు

శతఘ్ని న్యూస్: ఎన్నికల ప్రక్రియలో చివరి అంకం అభ్యర్థి గెలుపు, మెజారిటీ వెల్లడయ్యే నిర్ణయాత్మకమైన కౌంటింగ్ ఘట్టంలో ఏజెంట్ల పాత్ర కీలకమని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. నాగబాబు గారు స్పష్టం చేశారు. శ్రీ పవన్ కళ్యాణ్ గారు గెలవనున్న పిఠాపురం నియోజకవర్గంలో మెజారిటీకి సంబంధించి జాతీయ స్థాయిలో ఉత్కంఠ ఉన్నదని, ఏ ఒక్క ఓటు కూడా లెక్క తప్పకుండా చూసుకోవాల్సిన బాధ్యత పిఠాపురం నియోజకవర్గం కౌంటింగ్ ఏజెంట్లుగా వ్యవహరించే వారిపై ఉన్నదని అన్నారు. తాజాగా వెలువడిన ఎగ్జిట్ పోల్స్ కూడా కూటమికి ప్రోత్సాహకరంగా ఉన్నాయని వెల్లడించారు. ఆదివారం పిఠాపురం నియోజకవర్గం గోకులం గ్రాండ్ లో జరిగిన సమావేశంలో జనసేన కౌంటింగ్ ఏజెంట్లతో శ్రీ నాగబాబు గారు ప్రత్యేకంగా మాట్లాడారు. గతంలో భీమవరంలో కౌంటింగ్ ప్రక్రియలో జరిగిన పొరపాట్లు కారణంగా నష్టపోయామని గుర్తు చేస్తూ, అటువంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా ఎప్పటికప్పుడు కౌంటింగ్ ప్రక్రియను గమనిస్తూ, ఏవైనా సందేహాలు కలిగితే అందుబాటులో ఉన్న ఆర్.వో.కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. జనసేన జాతీయ అధికార ప్రతినిధి శ్రీ వేములపాటి అజయ్ కుమార్, జనసేన నాయకులు శ్రీ మర్రెడ్డి శ్రీనివాస్, శ్రీ యాతం నగేష్, శ్రీ పంచకర్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## పిఠాపురం శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాన్ని సందర్శించిన శ్రీ నాగబాబు

శతఘ్ని న్యూస్: పిఠాపురం పట్టణంలో "మానవత్వం ఈశ్వరత్వం" స్ఫూర్తితో గత 550 ఏళ్లుగా మతాతీత ఆధునిక దేవాలయంగా వెలుగొందుతున్న "శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం"ను జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. నాగబాబు గారు ఆదివారం సందర్శించారు. 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆశ్రమంలోని ఉద్యాన వనాలు, జ్ఞాన మందిరం, ఉపన్యాస మందిర ప్రాంతాలను సందర్శించిన అనంతరం పీఠాధిపతి డాక్టర్ శ్రీ ఉమర్ ఆలీషా సద్గురు గారితో శ్రీ నాగబాబు చరవాణి ద్వారా మాట్లాడారు. మతాలకు అతీతంగా, మానవత్వం, పర్యావరణం, విద్యా, ఆధ్యాత్మిక తత్వాలను పరిరక్షిస్తున్న విధానాన్ని కొనియాడారు. ఇంత గొప్ప స్ఫూర్తిని కొనసాగిస్తున్న పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా సద్గురు గారికి అభినందనలు తెలిపారు. పిఠాపురంలోని విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం కేంద్రంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మొత్తం 105 ఆశ్రమాలు నిర్వహిస్తున్నట్లు, ప్రపంచవ్యాప్తంగా 27 దేశాల్లో దాదాపుగా 9 లక్షల మందికిపైగా శిష్యులు వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జనసేన నాయకులు శ్రీ మర్రెడ్డి శ్రీనివాస్, పీఠాధిపతి డాక్టర్ శ్రీ ఉమర్ ఆలీ షా సద్గురు గారి సోదరులు శ్రీ అహ్మద్ అలీ షా, ఆశ్రమం కన్వీనర్ శ్రీ పి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.





## సకల జనుల విజయం... తెలంగాణ ఆవిర్భావం



శతఘ్ని న్యూస్: భారతదేశ చరిత్రలో తెలంగాణాకు ఒక ప్రత్యేకత ఉందని జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ ఒక ప్రకటనలో తెలిపారు. 1947లో తెలంగాణ మినహా దేశమంతటికీ స్వతంత్రం సిద్ధించింది. స్వాతంత్రం కోసం తెలంగాణ మరో రెండు సంవత్సరాలు వేచిచూడవలసి వచ్చింది. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం సుమారు 60 సంవత్సరాలపాటు ఎదురుచూడవలసి వచ్చింది. సకల జనుల కల సాకారమై ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం అప్పుడే దశాబ్ద కాలం పూర్తి చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. పోరాటాలకు పురిటి గడ్డయిన తెలంగాణ నాలో పోరాట స్ఫూర్తిని నింపింది. ఇక్కడ గాలిలో.. నేలలో.. నీటిలో.. మాటలో... చివరకు పాటలో సైతం పోరాట పటిమ తొణికిసలాడుతుంది. నీళ్లు–నిధులు–నియామకాలు అనే నినాదంతో సకల జనులు సాగించిన ఉద్యమాన్ని పాలకులు సదా గుర్తెరగాలి. ప్రజలందరికీ తెలంగాణ ఫలాలు సహజ న్యాయసూత్రాలకు అనుగుణంగా అందాలి. అభివృద్ధిలో తెలంగాణా రాష్ట్రాన్ని అగ్రపథంలో పాలకులు నిలపాలి. ప్రజా తెలంగాణను సంపూర్ణంగా ఆవిష్కరింప చేయాలి. అప్పుడే ఈ రాష్ట్ర ఆవిర్భావం కోసం ప్రాణాలను బలిదానం చేసిన అమరులకు నిజమైన నివాళి. ఈ దశాబ్ది వేడుకల సందర్భంగా నా పక్షాన, జనసేన శ్రేణుల పక్షాన తెలంగాణ వాసులందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నానని జనసేనాని పేర్కొన్నారు.

## హైదరాబాద్ లోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం



శతఘ్ని న్యూస్: హైదరాబాద్ లోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు నివాళులు అర్పించిన రాష్ట్ర ఇంచార్జ్ శ్రీ నేమూరి శంకర్ గౌడ్ గారు, రాధారం రాజలింగం గారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గాల ఇంచార్జులు, జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.



# శతఘ్ని న్యూస్

జనగళమే మా గళం




సోమవారం, 03 జూన్ 2024

# సాయిప్రియ సేవా సమితి సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం

శతఘ్ని న్యూస్: పిఠాపురం, గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలో వేగులమ్మగుడి వద్ద ఆదివారం సాయిప్రియ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు జ్యోతుల శ్రీనివాసు ఉచిత కంటి చికిత్సా శిబిరం ప్రారంభించారు. ఉచిత కంటి చికిత్సా శిబిరం ఉదయం 8-00 గంటల నుంచి మధ్యాహ్నం 01-00 గంట వరకు కాకినాడ కిరణ్ కంటి హాస్పిటల్ వారిచే మరియు సాయిప్రియ సేవా సమితి పిఠాపురం నియోజకవర్గం వారి సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించబడినది. సదరు ఉచిత నేత్ర వైద్య శిబిరం కార్యక్రమం నందు 210 మంది వైద్యం చేయించుకొన్నారు. కంటి ఆపరేషన్ నిమిత్తం 70 మందిని గుర్తించారు. వారిని కిరణ్ హాస్పిటల్ కాకినాడకు తరలించారు. ఈ కార్యక్రమంలో డా.బృంత, ప్రోగ్రామింగ్ మేనేజరు సత్యనారాయణ, నాగేశ్వరరావు, హరిబాబు, శ్రీకాంత్, చిన్నబ్బాయి, కందా శ్రీనివాస్, ఆకుల అర్జున్, ఇంటి వీరబాబు, కొలా నాని, విప్పర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.






## 2 సంవత్సరాలు సీఎంగా పవన్..!



శతఘ్ని న్యూస్: కళ్యాణదుర్గం, 2024 ఎన్నికల్లో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయ భవిష్యత్తు గురించి ప్రముఖ జ్యోతిష్య పండితులు కృష్ణమాచార్య స్వామీజీని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శులు రాయల్ లక్ష్మీనరసయ్య స్వయంగా కలిసి మాట్లాడి తెలుసుకోవడం జరిగింది. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ 2024 ఎన్నికల్లో కచ్చితంగా ముఖ్యమంత్రి అవుతారు అని కృష్ణమాచార్య స్వామీజీ చెప్పటం జరిగింది.

## ఘనంగా సుజన చౌదరి జన్మదిన వేడుకలు




శతఘ్ని న్యూస్: విజయవాడ, మాజీ కేంద్రమంత్రి ఎన్డీఏ బలపరిచిన విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ అభ్యర్థి యలమంచిలి సత్యనారాయణ చౌదరి (సుజన చౌదరి) పుట్టినరోజు వేడుకలలో భాగంగా ఆదివారం పశ్చిమ నియోజకవర్గం బిజెపి కార్యాలయంలో కేక్ కటింగ్ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, విజయవాడ తూర్పు నియోజకవర్గం మరియు విజయవాడ పార్లమెంట్ ఎన్నికల సమన్వయకర్త అమ్మిశెట్టి వాసు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, పశ్చిమ నియోజకవర్గ టిడిపి నాయకులు ఎం ఎస్ బేగ్, కృష్ణ పెన్నా కో-ఆర్డినేటర్ శ్రీమతి మల్లెపు విజయలక్ష్మి, తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి అన్నె ప్రసాద్ మరియు పశ్చిమ నియోజకవర్గ జనసేన పార్టీ డివిజన్ అధ్యక్షులు బిజెపి శ్రేణులు తదితరులు పాల్గొనడం జరిగింది.




## కూటమి విజయంలో పవన్ కళ్యాణ్ కీలకపాత్ర: ఆళ్ళ హరి



శతఘ్ని న్యూస్: గుంటూరు, ఎగ్జిట్ పోల్స్ లోనే కాదు ఎగ్జాక్ట్ పోల్స్ లోనూ కూటమిదే హవా అని, కూటమి విజయంలో పవన్ కళ్యాణ్ ది కీలకపాత్ర అని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ అరాచకాలపై ఐదేళ్లుగా జనసేన అలుపెరుగని పోరాటం చేసిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అరాచకాలకు, అక్రమాలకు భయపడి నామినేషన్ కూడా వేయటానికి అభ్యర్థులు వెనుకడుగు వేసిన సందర్భంలోనూ జనసేన శ్రేణులు ధైర్యంగా పోటీ చేసి ముప్పై శాతం ఓట్లు సాధించారన్నారు. ఇప్పుడం సభలో ఓటు చీలనివ్వనంటూ పవన్ కల్యాణ్ చెప్పిన మాటని నిలబెట్టుకున్నారని కొనియాడారు. టీడీపీ-జనసేన పొత్తులోకి బీజేపీని కూడా తీసుకొచ్చి వైసీపీ అక్రమాలకు అడ్డుకట్ట వేయటంలో పవన్ కళ్యాణ్ తొలివిజయం సాధించారని పేర్కొన్నారు. తానేం చేసినా రాష్ట్రం కోసమేనంటూ పవన్ కళ్యాణ్ చెప్పిన ప్రతీ మాటను ప్రజలు విశ్వసించారని అందుకే కూటమికి రికార్డు స్థాయి మెజారిటీని ఇవ్వనున్నట్లు వ్యాఖ్యానించారు. జగన్ రెడ్డి లాంటి విపరీత శాడిస్ట్ మనస్తత్వం ఉన్న వ్యక్తులు రాజకీయాల్లో ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. పోస్టల్ బ్యాలెట్ తోనే వైసీపీ పతనం ప్రారంభమైందన్నారు. వైసీపీ ఊసే లేని ఆంధ్రప్రదేశ్ కోసం పవన్ కళ్యాణ్ ఒక రాజకీయ యజ్ఞమే చేశారని కొనియాడారు. 48 గంటల్లో కూటమి నేతృత్వంలో రాష్ట్రానికి స్వేచ్ఛాయుత పవనాలు రానున్నాయని, ప్రజలకు ఇక అంతా మంచే జరుగుతుందని ఆశాభావాన్ని తెలియచేశారు. విలేకరుల సమావేశంలో రెల్లి యువత రాష్ట్ర నేత సోమి ఉదయ్, డివిజన్ అధ్యక్షులు సయ్యద్ షర్ఫుద్దీన్, గడ్డం రోశయ్య, తేజ, సాయి, ఆంజనేయులు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం జనసేన ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ 10వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



శతఘ్ని న్యూస్: గోదావరిఖని పరిశ్రామిక ప్రాంతంలో రామగుండం నియోజకవర్గ నాయకులు మోతే రవికాంత్ ఆధ్వర్యంలో ఘనంగా 10వ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగింది. మొదటగా తెలంగాణ పోరాట అమరవీరులకు మౌనం పాటించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నాయకులు మంథని శ్రావణ్ చేతుల మీదుగా జెండా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా మంథని శ్రావణ్ మాట్లాడుతూ దశాబ్దాల కల తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అని 2014 జూన్ 2న ఆ కల సాకారమైంది అని దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడింది. దీని వెనుక ఎందరో మహామహుల పోరాటం ఉంది అని, శ్రీకాంతచారి లాంటి యువకుల ప్రాణత్యాగం ఉన్నాయి అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు చిట్టి రాజశేఖర్, బండారి తిరుపతి, నరేష్, అర్షిత్ గౌడ్, సుద్దాల అనురాజ్, కట్కూరి రాజశేఖర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# శతఘ్ని న్యూస్
జనగళమే మా గళం

సోమవారం, 03 జూన్ 2024





## తెలంగాణ తల్లిని మరిచిన పాలకవర్గాలు.!: గాదె పృథ్వి

శతఘ్ని న్యూస్: స్టేషన్ ఘనపూర్, అధికార ప్రతిపక్షపార్టీలు తెలంగాణ తల్లిని విస్మరించడం బాధాకరమని జనసేనపార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గాదె పృథ్వి అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి జనసైనికులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు కనీసం పూలమాల కూడా వేయకుండా తెలంగాణ తల్లిని అవమానించారన్నారు. మధ్యాహ్నం అయినప్పటికీ నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్, భారాస పార్టీల నాయకులు తెలంగాణ తల్లిని విస్మరించడం సరికాదన్నారు. అధికారం కోసమే తప్ప కడియం, రాజయ్యలకు ఆత్మగౌరవం లేదన్నారు. ఉద్యమ నాయకులమని చెప్పుకోవడమే కానీ తెలంగాణ తల్లిని గౌరవించడం లేదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు మహమ్మద్ రజాక్, మునిగాల పవన్, అక్కెనపెల్లి సాయి, రాజేష్, బన్నీ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## కూకట్ పల్లిలో ఘనంగా తెలంగాణా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

శతఘ్ని న్యూస్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం కూకట్పల్లి నియోజకవర్గంలోని 5వ ఫేస్ జనసేన పార్టీ కార్యాలయము నందు తెలంగాణ తల్లి చిత్ర పటమునకు పూలమాలవేసి, అనంతరం 3వ ఫేస్ టెంపుల్ బస్ స్టాప్ వద్ద జెండా ఆవిష్కరించి యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ దశాబ్దాల కల తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అని 2014 జూన్ 2న ఆ కల సాకారమైంది అని దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడింది. దీని వెనుక ఎందరో మహామహుల పోరాటం ఉంది అని, శ్రీకాంతచారి లాంటి యువకుల ప్రాణత్యాగం ఉన్నాయి అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం జనసేన నాయకులు, జనసైనికులు మరియు వీర మహిళలు పాల్గొన్నారు.





## తాగితే ఆ నీరు... ప్రాణాలు బేజారు!

★ గజగజలాడుతున్న బెజవాడ
★ ఐదు రోజుల్లో పది మంది మృతి
★ వందలాది మందికి అస్వస్థత
★ చీమ కుట్టినట్టయినా లేని ప్రభుత్వం
★ మరణాలపై అధికారుల బుకాయింపు

అధికారం... అహంకారంతో కలుషితమైంది!
బాధ్యత... నిర్లక్ష్యంతో కలుషితమైంది!
పరిపాలన... బుకాయింపుతో కలుషితమైంది!
ఇన్ని కాలుష్యాల ముందు మంచి నీళ్లు కలుషితమవడం ఏపాటి?
అందుకే విజయవాడలో ఐదు రోజుల్లో పది మంది మరణించినా...
మరో 150 మంది అస్వస్థతకు గురైనా అధికారులు పెద్దగా పట్టించుకోలేదు...
పైగా మరణాలకు కలుషిత నీటి సరఫరా కారణం కాదని కూడా ప్రకటనలు చేస్తున్నారు...
పేదల మరణాలపై ప్రభుత్వం కూడా స్పందించ లేదు!
ఎందుకంటే వైకాపా ప్రభుత్వం వైషమ్య రాజకీయాలతో ఎప్పుడో కలుషితమైపోయింది!
దానికిక ప్రజల ఈతి బాధలను పట్టించుకునే తీరిక ఎక్కడ దొరుకుతుంది?
తాగునీటి కుళాయిల్లోంచి రంగు నీళ్లు వస్తున్నాయని జనం ఎప్పటి నుంచో మొరపెట్టుకున్నారు...
మురుగు కాల్వల పక్కనే ఉన్న పైపులైన్లు లీకేజి అవుతున్నాయి మొర్రో అని మొత్తుకున్నారు...
పైనుంచి కింది వరకు బాధ్యతారాహిత్యంతో కలుషితమైపోయిన వైకాపా హయాంలో సామాన్యుల విన్నపాలు వినే తీరికెవరికి?

బెజవాడలో కొన్ని ప్రాంతాల ప్రజలను గజగజలాడిస్తున్ననీటి కాలుష్యం మూలాలకేసి దృష్టి సారిస్తే ఎన్నో కారణాలు కనిపిస్తాయి. అడుగడుగునా అధికార గణంలో పేరుకుపోయిన నిర్లక్ష్యం జాడలు కనిపిస్తాయి.

ఓ పక్క కృష్టా నదిలో నీటి ప్రవాహం తగ్గిపోయింది. మరో పక్క పైపులైన్ల నిర్వహణ, పారిశుధ్యంపై శ్రద్ధ కరవైంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినా నిర్వహణ అటకెక్కింది. వీటన్నింటి ఫలితం ప్రజల ఆరోగ్యం, ప్రాణాలపై ప్రభావం చూపుతోంది. విద్యాధరపురంలోని హెడ్ వాటర్ వర్క్స్ నుంచి నగరంలోని అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా చేయడానికి కృష్టా నది జలాలు సమృద్ధిగా లేని కారణంగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో పలు చోట్ల బోర్లు తవ్వించారు. భూగర్భజలాలను తోడి రిజర్వాయర్లకు చేర్చి సరఫరా చేయాలనేది ఉద్దేశం. కానీ నిర్వహణ సక్రమంగా లేకపోవడం సామాన్యుల పాలిట శాపమైంది. విద్యాధరపురం, మొగల్రాజపురం తదితర అనేక ప్రాంతాలకు సరఫరా అవుతున్న నీరు కలుషితం కావడానికి కారణం బోర్ల ద్వారా సేకరించిన నీటిని సక్రమంగా శుద్ధి చేయకపోవడమేనన్నది చేదు నిజం. తాగు నీరు సరిగ్గా క్లోరినేషన్ అవుతోందో లేదో కూడా పట్టించుకునే నాధుడు లేదు. బోర్ల వద్ద ఉన్న డ్రోజర్లు చాలా వరకు పని చేయకపోవడంతో క్లోరినేషన్ లేకుండానే నీరు ప్రజలకు సరఫరా అయిపోతోంది. దీనికి సాయం మురుగు కాల్వల పక్కనే ఉన్న మంచి నీటి పైపులైన్ల పరిశీలన కూడా కరవైపోయింది. ఈ పైపులైన్లలో లీకేజీలను గుర్తించకపోవడంతో డ్రైనేజి వాటర్ కలిసిపోతోంది. దాంతో వందలాది మంది అతిసారం బారిన పడ్డారు. వాంతులు, విరోచనాలతో ఆసుపత్రులకు వస్తున్న కేసులు పెరుగుతుంటే తక్షణ చర్యలు తీసుకుని, కారణాలేంటో తెలుసుకుని హుటాహుటిన స్పందించి నివారణ చర్యలు తీసుకోవలసిన అధికారులు, మరణాలకు వేరే కారణాలు వెతకడంలో పడిపోయారు. పలుచోట్ల మంచి నీరు రంగుమారిందని ఫిర్యాదులు వచ్చినా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారుల వైఖరి వల్ల సమస్య జటిలం అయిపోయింది. ఫలితంగా చూస్తుండగానే ఐదు రోజుల వ్యవధిలో పది మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. దాదాపు 150 మందికి పైగా సామాన్యులు అస్వస్థతకు గురై అలమటిస్తున్నారు. మొగల్రాజపురంలోని అనేక ప్రాంతాల్లో భూగర్భ మురుగునీటి మ్యాన్ హోల్స్ పొంగిపొరలుతున్నా సకాలంలో స్పందించిన దాఖలాలు లేవు. మధురానగర్, కండ్రిక, వన్‌టౌన్, గవర్నర్ పేట, సూర్యాపేట తదితర పలు ప్రాంతాల్లో మ్యాన్ హోల్స్ గురించి పట్టించుకున్న అధికారులే లేరు. పైగా ప్రజల అనారోగ్యానికి, మరణాలకు తాగునీరు కారణం కాదని నగర పాలక సంస్థ అధికారులు బుకాయిస్తున్నారు. అయోధ్యనగర్, పాతబస్తీ, సింగ్ నగర్, పాయకాపురం, ప్రజాశక్తి నగర్, శాంతి నగర్, గొల్లపాలెం గట్టు, వింజిపేట, చిట్టినగర్ లాంటి ప్రాంతాల్లో రంగు మారిన నీరు వస్తున్నా కనీస పరిశీలన అటు అధికార యంత్రాంగంలో కానీ, ఇటు పాలక వర్గం ప్రతినిధుల్లో కానీ కొరవడింది.

ఇక నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న తాగునీటి రిజర్వాయర్లయినా సరిగా ఉన్నాయా అంటే అదీ లేదు. నెలలో కనీసం రెండుసార్లయినా రిజర్వాయర్లను శుభ్రం చేయాల్సి ఉంది. కానీ అలా జరగక పోవడంతో రిజర్వాయర్లలో నల్లటి మడ్డి చేరుతోంది. ఇదే నీటితో కలిసి ప్రజలకు సరఫరా అవుతోంది. ఇన్ని అవకతవకల మధ్య ప్రజారోగ్యం గాలిలో దీపంలా అల్లాడుతోంది. అయినా... అయిదేళ్లుగా వైకాపా ప్రభుత్వం హయాంలో చోటు చేసుకున్న అనేక అరాచక అధికార పరిపాలన విధానాలతో పోలిస్తే ఇప్పుడు విజయవాడ కలుషిత నీటి సమస్య స్థాయి ఏపాటిది?



SRI TV
# శతఘ్ని న్యూస్
జనగళమే మా గళం

సోమవారం, 03 జూన్ 2024




